ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 08-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- విద్యార్థులు వికసిత్ భారత్ ప్రయాణంలో కీలక పాత్ర పోషిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- సహకార బ్యాంకులు కేవలం లాభాలను ఆర్జించడమే కాకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాయని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు.
- న్యాయ వ్యవస్థ వద్దకు పౌరులు రావాలని ఆశించే కంటే, న్యాయమే పౌరుల వద్దకు వెళ్లాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.
- హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఈరోజు ఉదయం జరిగిన బస్సు ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

= = = = = = = = = = = = = = = = = = =

పట్టభద్రులవుతున్న విద్యార్థులు వికసిత్ భారత్ ప్రయాణంలో కీలక పాత్ర పోషిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు తమ నిర్ణయాల్లో జాతీయ ప్రయోజనాలను కేంద్ర బిందువుగా ఉంచుకోవాలని, తమ చర్యలు దేశంపై ఎటువంటి ప్రభావం చూపుతాయో తాము ప్రశ్నించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి తరం ఆ సమయానికి సంబంధించిన నిర్దిష్ట సవాళ్లను ఎదుర్కొంటుందని, తనదైన దేశ బాధ్యతను మోస్తుందని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్…31 సెకన్లు)

అదేవిధంగా.. దేశంలో ఆవిర్భవిస్తున్న నూతన రంగాలు, యువతకు నూతన అవకాశాలను అందిస్తున్నాయని ప్రధానమంత్రి చెప్పారు. పనిచేస్తున్న రంగాల ఆధారంగా ఇతరులతో పోల్చుకోవద్దని, అభివృద్ధి చెందేందుకు ప్రతిరోజూ శ్రమించాలని విద్యార్థులను కోరారు. సెమీకండక్టర్లు, అంతరిక్షం, డ్రోన్ల వంటి రంగాలను ఆయన ఉదహరిస్తూ.. భారత్ అన్ని రంగాల్లోనూ ఆత్మనిర్భరత (స్వయంసమృద్ధి) సాధించే దిశగా పనిచేస్తోందని తెలిపారు. ఈ ప్రయాణం 'వికసిత్ భారత్' నిర్మాణానికి బలమైన పునాదిగా ఉపయోగపడుతుందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్…34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

న్యాయవ్యవస్థను ఆశ్రయించలేని ప్రజలకు న్యాయం అందించడమే నిజమైన న్యాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లని భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్య కాంత్ స్పష్టం చేశారు. ఇండోర్‌లో ఈరోజు జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (NALSA) వెస్ట్ జోన్ ప్రాంతీయ సదస్సు ప్రారంభోత్సవ సమావేశంలో ఆయన ప్రసంగించారు. న్యాయ వ్యవస్థ వద్దకు పౌరులు రావాలని ఆశించే కంటే, న్యాయమే పౌరుల వద్దకు వెళ్లాలని అన్నారు. సాంకేతికత.. దూరాలను తగ్గించి, న్యాయ సహాయాన్ని విస్తరించడంలో ఒక ముఖ్యమైన సాధనంగా

మారిందని తెలిపారు. చట్టపరమైన అవగాహనను సంక్లిష్టమైన చట్టపరమైన పదజాలంలో కాకుండా ప్రజలకు అలవాటైన భాషలోనే తెలియజేయాలని జస్టిస్ సూర్య కాంత్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలోని ఫోర్ట్ ప్రాంతంలో నేషనల్ అర్బన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NUCFDC) నూతన కార్యాలయ భవనాన్ని కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. 'ఆపరేషనల్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ రెసిలియెన్స్' అనే అంశంపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించడంతో పాటు ఆరు సహకార బ్యాంకుల ప్రతినిధులను అమిత్ షా సత్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. సహకార బ్యాంకులు కేవలం లాభాలను ఆర్జించడానికే కాకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఉద్దేశించినవని పేర్కొన్నారు. అన్ని సహకార బ్యాంకులు అంబ్రెల్లా సంస్థలో, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (SOC)లో చేరాలని పిలుపునిచ్చారు. సమృద్ధి భారత్‌ను నిర్మించాలంటే భారతీయులు స్వయంగా సమృద్ధి చెందాలని అమిత్ షా తెలియజేస్తూ...

(వాయిస్…33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

నావికుల భద్రత, గౌరవం, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర నౌకాయానం, ఓడరేవులు, జలమార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ స్పష్టం చేశారు. ముంబైలో ఈరోజు జరిగిన నావికుల భద్రత, రక్షణ, సంక్షేమం జాతీయ వాటాదారుల సమావేశంలో మాట్లాడిన కేంద్రమంత్రి.. ప్రపంచంలోనే అగ్రగామి నావిక దేశాల్లో ఒకటిగా భారత్ అవతరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమగ్ర డిజిటల్ మేరిటైమ్ గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్ 'ఈ-సముద్ర' (E-Samudra) ను కూడా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

యుపిఐ (UPI) సేవలు వినియోగదారులకు ఉచితంగానే కొనసాగుతాయని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (PCI) ప్రకటించింది. భారతీయులందరూ ఎలాంటి లావాదేవీ రుసుములు లేకుండా తక్షణ డిజిటల్ చెల్లింపులు చేసుకోవచ్చని PCI ఈరోజు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. చిన్న వ్యాపారులు కూడా డిజిటల్ చెల్లింపులను స్వీకరించడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. యుపిఐ విశ్వసనీయతను కాపాడేందుకు బ్యాంకులు, ఫిన్-టెక్ కంపెనీలు, ఎన్‌పిసిఐ (NPCI), ఆర్‌బిఐ (RBI)లు సాంకేతికత, సైబర్ భద్రత, మోసాల నిరోధం, ఆవిష్కరణలలో పెట్టుబడులు పెడుతున్నాయని PCI తెలిపింది. వ్యాపారులు, చెల్లింపుల సేవా సంస్థల మధ్య జరిగే వ్యాపార ఒప్పందాల ఆధారంగా వర్తించే మర్చంట్ సర్వీస్ ఛార్జీల వలె వినియోగదారులు డిజిటల్ చెల్లింపుల కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని PCI స్పష్టం చేసింది. యుపిఐ అనేది ప్రతిరోజూ మిలియన్ల మంది పౌరులు ఉపయోగించే అత్యంత కీలకమైన జాతీయ డిజిటల్ మౌలిక సదుపాయంగా మారిందని PCI పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఈరోజు ఉదయం జరిగిన ఒక ప్రైవేట్ బస్సు ప్రమాదంలో ఏడుగురు మరణించగా, మరో 11 మంది గాయపడ్డారు. చురా శాసనసభ నియోజకవర్గంలోని తిస్సా పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగఢ్ వద్ద చలువంజ్ మోర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బైరాగఢ్ నుండి చంబా వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు, చలువంజ్ మోర్ వద్ద రోడ్డు దిగి కింద ఉన్న మరొక రోడ్డుపై పడిపోయినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. గాయపడిన వారిలో ఆరుగురిని మెరుగైన వైద్య చికిత్స కోసం చంబాలోని పండిట్ జవాహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని చంబా పోలీస్ సూపరింటెండెంట్ విజయ్ సక్లానీ తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఓణం పండుగ సందర్భంగా రైల్వే శాఖ కేరళ రాష్ట్రానికి ప్రకటించిన ప్రత్యేక రైలు సేవల సంఖ్యను 112కు పెంచింది. ఈ ప్రత్యేక సర్వీసులను ప్రధానంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి కేరళకు నడుపుతున్నారు. పండుగ కోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం, పండుగ రద్దీని తగ్గించడానికి ఆగస్టు 14 నుండి సెప్టెంబర్ 6 మధ్య రైల్వే శాఖ ఈ ప్రత్యేక రైలు సర్వీసులను నడపనుంది. తూర్పు ప్రాంత రాష్ట్రాలలో కూడా ఓణం ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం అధ్యక్షతన భోపాల్‌లో ఈరోజు 11వ బ్రిక్స్ (BRICS) సాంస్కృతిక మంత్రుల సమావేశం జరిగింది. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల మధ్య సాంస్కృతిక సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశంలో 'భోపాల్ డిక్లరేషన్' ను ఆమోదించారు. 10 బ్రిక్స్ సభ్య దేశాలు, నాలుగు భాగస్వామ్య దేశాలతో సహా మొత్తం 14 దేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. సాంస్కృతిక సహకారానికి భోపాల్ సమావేశం ఒక ఆచరణాత్మకమైన, భవిష్యత్ దృక్పథంతో కూడిన కార్యాచరణను అందించిందని చెప్పారు. సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించేందుకు అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని కేంద్రమంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ కొరియాలోని అసన్ (Asan)లో జరుగుతున్న కొరియా మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ అస్మిత చాలిహా మహిళల సింగిల్స్ ఫైనల్‌కు చేరుకుంది. ఈరోజు జరిగిన సెమీఫైనల్లో అస్మిత మరో భారత క్రీడాకారిణి రక్షిత రామ్‌రాజ్‌ను 21-13, 16-21, 21-13 తేడాతో ఓడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో ఈరోజు భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భారత వాతావరణ శాఖ (IMD) 'ఆరెంజ్ అలర్ట్' హెచ్చరికను జారీ చేసింది. లక్షద్వీప్, ఉత్తర కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి కారైకాల్ ప్రాంతాలలో ఈదురు గాలులు, మెరుపులతో కూడిన ఉరుముల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాబోయే 2 నుండి 3 రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =